


లక్ష్మా రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే దొంతి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ,అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -158 శనివారం 6 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## రెండోసారి ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నా!

### గురుపూజోత్సవ కార్యక్రమంలో సిఎం రేవంత్

- తెలంగాణకు నూతన విద్యావిధానం కావాలి
- ఎన్నో సంస్కరణలు తీసుకుని రావాలి
- ప్రపంచ దేశాలతో విద్యలో తెలంగాణ పోటీ పడాలి
- కేజ్రీవాల్ సంస్కరణ వల్లనే మూడోమారు సిఎం అయ్యారు
- గత పాలకులు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారు



హైదరాబాద్, **సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణకు నూతన విద్యా విధానం కావాలని,రావాల్సిన అసవరం ఉందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రతిసమస్యను పరిష్కరిస్తున్నానని చెప్పారు. విద్యాశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరముందని అన్నారు. విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వంలో నూతన నియామకాలు లేవని ఆరోపించారు. గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ- మూతపడే పరిస్థితికి వచ్చిందన్నారు.

మిగతా 2లో...

## జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్,డీజిల్‌లను తీసుకు రాలేం

- ఏకరూప పన్ను విధానం మనదేశంలో అసాధ్యం
- కేంద్ర అర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** మన దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితమైనదని, ఇలాంటి సమయంలో ఒకే పన్ను విధానాన్ని తీసుకురావడం అసాధ్యమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్వరూపంలో కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణలపై ఆమె మాట్లాడారు.తమ ప్రభుత్వానికి పౌరుల అవసరాలే ప్రథమ ప్రాధాన్యమని, ఆ తర్వాతే ఆదాయం గురించి ఆలోచిస్తామని పేర్కొన్నారు. టారిఫ్‌ల వల్ల ఎగుమతిదారులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారంపైనా కేంద్రం దృష్టిపెట్టినట్లు- తెలిపారు. ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనేదీ లేదని మరోసారి స్పష్టం చేశారు

మిగతా 2లో...

## సిఎం రేవంత్‌తో జర్మన్ ఫార్మా ప్రతినిధుల భేటీ

### తెలంగాణలో మెడికల్ ఈక్విప్‌మెంట్ యూనిట్ ఏర్పాటుకు ఆసక్తి



హైదరాబాద్, **సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** :జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జర్మనీకి చెందిన బెబిగ్ మెడికల్ సీఈవో జార్జ్ చాన్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలంగాణలో మెడికల్ ఎక్విప్ మెంట్ ఉత్పత్తి యూనిట్ ను ప్రారంభించడానికి ఆసక్తి చూపుతున్నట్లు జర్మన్ కంపెనీ తెలిపింది. తెలంగాణలో మెడికల్ ఎక్విప్ మెంట్ ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు-చేసేందుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ తెలిపారు..అనువైన స్థలం, ఇతర అంశాలకు సంబంధించి అధ్యయనం చేసి రిపోర్టు అందించాలని అధికారులకు సిఎం ఈ సందర్భంగా సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెడికల్ ఎక్విప్ మెంట్ తో పాటు-, క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడే రేడియేషన్ సెంటర్స్‌ను ఏర్పాటు- చేయాలని కంపెనీ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## నేడే నిమజ్జనం

- నేటి నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు
- ట్యాం బండ్ పరిసరాల్లో భారీగా బందోబస్తు
- విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు
- ఉదయం ఆరు నుంచి నిమజ్జనం ప్రారంభం
- ప్రధాన రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగింపు
- చివరి రోజు ఖైరతాబాద్‌కు పోటెత్తిన జనం
- ఖైరతాబాద్ గణపతికి రేవంత్ ప్రత్యేక పూజలు
- 71 ఏళ్లుగా ఉత్సవాల నిర్వహణపై అభినందనలు



హైదరాబాద **సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టారు. ట్యాం బండ్ పరిసరాల్లో క్రేన్లు సిద్దంగా ఉన్నాయి. పోలీసులు బందోబస్తు కోసం రంగంలోకి దిగారుమిగతా 2లో...మిగతా 2లో...

## పెట్టుబడుల ఆకర్షణకు సహకరించండి

### ప్రధాని మోడీతో లోకేశ్ భేటీ

### ఎపి ప్రాజెక్టులపై మరోమారు చర్చ




## భారత్‌తో సంబంధాలు దిగజారాయి

### ట్రూత్‌లో ట్రంప్ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** భారత్- అమెరికా సంబంధాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు దిగజారాయనే భావంలో మాట్లాడారు. తాము భారత్, రష్యాలకు దూరమైనట్లే అని వ్యాఖ్యానించారు. షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్‌లు కలిసి ఉన్న ఫొటోను షేర్ చేసిన ట్రంప్.. ఆ మూడు దేశాలకు ఉజ్వల భవిష్యత్తు కలిగి ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.



## బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం



కామారెడ్డి సభకు భారీగా ఏర్పాట్లు
ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంతే సిఎం
పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

2లో.

## భూభారతితో ధరణి దుర్మార్గాలకు పాతరేశాం

- ధరణి బాగోతాలు బయటకు రాకుడదనే దుర్మార్గం
- వివో, విఆర్‌వోల రద్దు వెనక అతిపెద్ద కుట్ర
- జీపీవోలకు నియామక పత్రాలు అందించిన సిఎం రేవంత్ రెడ్డి




## కెసిఆరే సుప్రీం

- ఏడాదన్నరగా తిరోగమన దిశలో పాలన
- కాళేశ్వరంపై విమర్శలతో గోదావరి జలాలు వృధా
- దెబ్బతిన్నరాష్ట్రప్రయోజనాలు, రైతు ప్రయోజనాలు
- పనిపై దృష్టి పెట్టకుండా గూగుల్‌పై దృష్టి సారిస్తే ఎలా
- లంబన్ బిఆర్ఎస్ సమావేశంలో ఎమ్మెల్యే హరీష్ రావు



హైదరాబాద్, **సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** బిఆర్ఎస్ పార్టీకి కెసిఆరే సుప్రీం అని బిఆర్ఎస్ నేత హరీష్ రావు ప్రశంసించారు. లండన్ లో బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..మిగతా 2లో...

# రెండోసారి ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నా!



(మొదటి పేజీ తరువాయి)
హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళావేదికలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలతో విద్యలో తెలంగాణ పోటీ- పడాలని సీఎం అన్నారు. తెలంగాణకు ఎడ్యుకేషన్ పాలసి కావాలని స్పష్టం చేశారు. ఆ పాలసీ పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని సూచించారు. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ మూడో సారి సీఎం కావడానికి కారణం విద్యా రంగంలో ఆయన తెచ్చిన మార్పులే అని గుర్తు చేశారు. తాను కూడా అలా కావాలని అనుకుంటున్నట్లు- సీఎం చెప్పారు. తనకు కూడా రెండో సారి, మూడో సారి సీఎం కావాలని ఉంటుంది అన్నారు. తాను ఫార్మ్ హౌస్‌లో పడుకుని మిమ్మల్ని పని చేయమని చెప్పానని, డీజిల్ మెకానిక్ నేర్చుకుంటే ఉపయోగం ఏంటని, బెంజ్ కార్ల కాలంలో అని సీఎం ప్రశ్నించారు. అంబాసడర్ కారు కావాలంటే ఫార్మ్ హౌస్‌కు వెళ్ళాలని అన్నారు. విద్యార్థుల జీవితాల్లో మార్పులు తీసుకురావాలని యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు ఏర్పాటు- చేశామన్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ బారిన పడుతున్నారు. డ్రగ్స్ మహమ్మారి తాలూకా స్థాయికి చేరిందని అన్నారు. దీనిని అరికట్టడానికి ఈగల్ ఫోర్స్ ఏర్పాటు- చేశామని చెప్పారు. అందరం కలసి అద్భుతమైన తెలంగాణను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. కేజీ టు- పీజీ అంటే గతంలో ఉన్న ప్రభుత్వానికి మీరు సంపూర్ణ మద్దతు అందించారు. కేజీ 2 పీజీ ఉచిత నిర్బంధ విద్య అందిందా అని సీఎం ప్రశ్నించారు. మారుమూల ప్రాంతాల్లో స్కూల్స్ మూత పడ్డాయో లేదో ఆలోచించాలని అన్నారు. తెలంగాణ నినాదాన్ని, ఉద్యమాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లింది టీచర్‌లని గుర్తు చేశారు. తెలంగాణ సాధనలో క్రియాశీలకంగా వ్యవహరించిన టీచర్‌లు గత పదేళ్లలో ఎన్ని సమస్యలను పరిష్కరించుకున్నారని సీఎం ప్రశ్నించారు. గత పాలకులకు ఉపాధ్యాయుల సమస్యలను ప్రరిష్కరించాలనే ఆలోచన రాలేదు... తమ ప్రభుత్వం వచ్చాకే వారి సమస్యలు పరిష్కారం అయ్యాయని చెప్పారు. ప్రజా ప్రతినిధుల ప్రైవేట్ వర్సిటీ-లు పెట్టు-కొని వ్యాపారం చేశారని, ప్రభుత్వ వర్సిటీల్లో గత ప్రభుత్వం నియామకాలు చేపట్టలేదని విమర్శించారు. ఓయూ మూత పడే పరిస్థితికి వచ్చిందని అన్నారు. గురుపూజోత్సవ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు బోధిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల కంటే నాణ్యమైన విద్య అందిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ఏటా 200 మంది టీచర్లను విదేశాలకు పంపి.. అక్కడి విద్యా విధానం అధ్యయనం చేసేలా ప్రోత్సహిస్తాం. ఢిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి సీఎం కావడానికి ఆయన చేసిన విద్యాభివృద్ధే కారణం. నాకూ స్వార్థం ఉంది. టీ-చర్లు బాగా పని చేస్తే నేనూ రెండోసారి సీఎం అవ్వాలనుకుంటు-న్నా. మీతోపాటే నేనూ కష్టపడతా. నేను ఫామ్ హౌస్‌లో పడుకుంటా.. మళ్లీ సీఎంను చేయండి అని అనట్లేదు. విద్యాభివృద్ధి కోసం టీచర్లు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా. ఐటీఐలు అప్‌డేట్ చేసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా మార్చాం. ఏటీసీలో టాటా కంపెనీ కల్పించిన సదుపాయాలు చూస్తే నాకే మతిపోయింది. 140 కోట్ల మంది జనాభా ఉన్న భారత్.. ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణం సాధించలేదు. దక్షిణ కొరియాలో ఒక్క యూనివర్సిటికి చెందిన వారే 16 స్వర్ణపతకాలు సాధించారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయండి. వారికి ప్రభుత్వమే అన్ని సదుపాయాలు కల్పిస్తుంది. క్రీడల్లో రాణించిన క్రికెటర్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ డీఎస్పీ అయ్యారని రేవంత్ తెలిపారు. చాలా చోట్ల కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అందడం లేదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రతి గ్రామానికి జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులే. జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించేలా చేశారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులు తమ సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకున్నారు? నేనూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే ఈ స్థాయికి వచ్చాను. గతంలో గురుపూజోత్సవం ఎప్పుడైనా జరిగిందా..? అందులో సీఎం పాల్గొన్నారా? తెలంగాణ పునర్నిర్మాణంలో టీ-చర్ల సహకారం కావాలి. పిల్లలు ఎక్కువ సమయం టీచర్ల వద్దే ఉంటారు. పిల్లలతో కలిసే టీచర్ల మధ్యాహ్న భోజనం చేయాలి. వర్సిటీలకు వీసీలను నియమించడానికి గత ప్రభుత్వానికి తీరిక లేదు. ప్రస్తుతం ప్రభుత్వం, టీ-చర్ల చొరవతో కొత్తగా 3 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ప్రైవేట్ స్కూళ్ల టీ-చర్ల కంటే.. ప్రభుత్వ టీచర్లకు నైపుణ్యం ఎక్కువ. వివాదాస్పదమైన విద్యాశాఖ తీసుకోవద్దని నాకు కొందరు సూచించారు. అయినా వినకుండా ఈ శాఖను నా వద్దే ఉంచుకున్నా అని రేవంత్‌రెడ్డి అన్నారు. చాలా మంది ముఖ్యమంత్రులు ఫైనాన్స్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలను తమ దగ్గర పెట్టు-కుంటారు. కానీ తాను విద్యాశాఖను తన దగ్గర పెట్టు-కున్నట్లు- తెలిపారు. అత్యంత వివాదాస్పద శాఖ విద్యా శాఖ.. అది తనకు వద్దని పలువురు చెప్పారు... కానీ వివాదాస్పదం సంగతి చూద్దామనే తన దగ్గర పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి విద్యాశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమైన శాఖ అని.. అందుకే దానిని తాను పర్యవేక్షిస్తున్నట్లు- చెప్పారు. కొంత మంది అవగాహన రాహిత్యంతో ఈ శాఖకు మంత్రిని పెట్టమని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. విమర్శలకు ఒకటే మాట చెప్తున్నా... ఈ శాఖలో ఉన్న సమస్యల పరిష్కారం కోసమే దీనిని తన దగ్గర పెట్టుకున్నట్లు- స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో గురుపూజోత్సవం జరిగిందా.. ఆ కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి వచ్చారా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మీ లాంటి టీ-చర్‌లు చెప్పిన చదువు నేర్చుకునే ఈ స్థాయికి వచ్చానని ఆయన అన్నారు. ఉపాధ్యాయులను చిన్నచూపు చూసే ఆలోచన ప్రజాప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు ఎక్కువగా ఉన్న, తక్కువగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారని, దీనికి కారణం అయితే తాను కావాలి లేదంటే ఉపాధ్యాయులు అయ్యి ఉండాలని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్‌లో కన్నా ప్రభుత్వ స్కూల్ టీ-చర్‌లు అధికంగా చదువుకున్నవారు.. ఇకపై సర్కార్ స్కూల్స్‌లో పిల్లల నమోదు సంఖ్య పెరగాలని అన్నారు. స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అందుకే ప్రతి ఏడాది రూ.130 కోట్ల సీఎస్ఆర్ నిధులు పాఠశాలలో క్లీనింగ్‌కు కేటాయించినట్లు- పేర్కొన్నారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురవడం తనకు బాధ కలిగిందని సీఎం అన్నారు. ఇకపై ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని.. అప్పుడప్పుడు తాను కూడా వచ్చి మీతో, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తానని సీఎం అన్నారు.

# పెట్టుబడుల ఆకర్షణకు సహకరించండి

## ప్రధాని మోడీతో లోకేశ్ భేటీ

## ఎపి ప్రాజెక్టులపై మరోమారు చర్చ



**న్యూఢిల్లీ సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ- శాఖల మంత్రి నారా లోకేష్ ప్రధానమంత్రి నరేంద్రమోదీతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. 45 నిమిషాలపాటు ఈ భేటీ- కొనసాగింది. ఈ సందర్భంగా యోగాంధ్ర టేబుల్ బుక్‌ను ఆవిష్కరించారు ప్రధానమంత్రి మోదీ. ఏపీకి కేంద్ర ప్రభుత్వ సాయం, పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్ర పథకాల అమలు, తాజా రాజకీయ పరిస్థితులపై ప్రధానితో చర్చించారు లోకేష్. జీఎస్టీ స్లాబ్‌ల హేతుబద్ధీకరణ, సంస్కరణల అమలుపై ప్రధాని మోదీకి లోకేష్ అభినందనలు తెలిపారు. ప్రత్యేకించి విద్యారంగంలో ఉపయోగించే పలు రకాల వస్తువులపై పన్ను తగ్గించినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు మంత్రి లోకేష్. ఏపీలో పెట్టు-బడులు, పరిశ్రమల స్థాపన, సింగపూర్‌లో ఏపీ బృందం పర్యటన వివరాలను ప్రధానికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఇకపోతే రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు సహకారం అందించాలని ప్రధానిని లోకేశ్ కోరారు. రాష్ట్రంలో ఐటీ-, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని.. ఉన్నతవిద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు సహకారం అందించాలని కోరారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15నెలలుగా కేంద్రం సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నామని చెప్పారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలోని కోట్లాది పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను ఆయన వివరించారు. ప్రధాని స్పందిస్తూ.. రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఈ సందర్భంగా ప్రధానికి లోకేశ్ బహూకరించారు. మే 17న తన సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు దేవాంశ్‌లతో మోదీని కలిసిన లోకేశ్.. నాలుగు నెలల వ్యవధిలో మళ్లీ ప్రధానమంత్రిని కలవడం విశేషం.

## జిఎస్టీ పరిధిలోకి పెట్రోల్,డీజిల్‌లను తీసుకు రాలేం

(మొదటి పేజి తరువాయి)
సామాన్యులపై పన్ను భారం తగ్గించేందుకే జీఎస్టీ విధానంలో ఈ సవరణలు చేసినట్లు తెలిపారు. జాతీయ మీడియా సంస్థ 'ఇండియాటు-డే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మల ఈ వ్యాఖ్యలు చేశారు. వన్ నేషన్- వన్ ట్యాక్స్ మంచి ఆలోచనే కానీ.. ఆచరణలో అది సాధ్యం కాదు. అభివృద్ధిలో వైవిధ్యాలు ఉన్నప్పుడు ఏకరూప జీఎస్టీ రేటును అమలు చేయడం అన్యాయమవుతుంది. మెర్సిడెస్ బెంజ్ కారు, హవాయి చెప్పులకు ఒకే పన్ను రేటు- విధించగలమా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితంగా ఉంది. అభివృద్ధి చెందిన రంగాలు అధిక పన్నులను కట్టగలుగుతాయి. అభివృద్ధి చెందని రంగాలకు అది భారమవుతుంది. ఒకవేళ భారత్ అన్ని రంగాల్లో సంపూర్ణంగా అభివృద్ధి చెందితే అప్పుడు ఒకే పన్ను విధానం సాధ్యమవుతుందని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ సందర్భంగా విపక్ష కాంగ్రెస్ పార్టీపై ఆర్థిక మంత్రి విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అంటూ ఎగతాళి చేసిన వారే.. ఇప్పుడు పన్ను సంస్కరణలు చేయగానే క్రెడిట్ తీసుకునేందుకు ఆరాటపడుతున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 91శాతం వరకు ఆదాయపు పన్ను విధించిన రోజులు ఉన్నాయని దుయ్యబట్టారు. జీఎస్టీలో సంస్కరణ వల్ల రాష్ట్రాలతో పాటు- కేంద్రానికి కూడా ఆదాయంలో కొంత కోత ఉంటుందని నిర్మలాసీతారామన్ తెలిపారు.

## బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం

### పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్, **సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నట్లు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కార్యకర్తలను కూడా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కామారెడ్డిలో బహిరంగ సభ ఏర్పాటుకు సీఎం ఆదేశాలతో సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ముందుకు వెళ్తాం. ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంత్‌రెడ్డే మళ్లీ సీఎం అవుతారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుపుకొని వెళ్తున్నాం. క్రమశిక్షణ విషయంలోనూ ఎక్కడా రాజీపడటం లేదు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించాలి. సీబీఐలో కొంత లొసుగులు ఉన్నాయి. అది వాస్తవం అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ నెల 15 వ తేదీకి పిసిసి పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తి అయిందని, క్రమశిక్షణ విషయంలో కూడా ఎక్కడా రాజీపడలేదని తెలియజేశారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నామని, కార్యకర్తలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. సిబిఐలో కొంత లొసుగులు ఉన్నాయని అది వాస్తవం అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముందుకు వెళతామని, ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంత్ రెడ్డే మళ్లీ సిఎం అవుతారని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## భారత్‌తో సంబంధాలు దిగజారాయి

**(మొదటి పేజి తరువాయి)** భారత్, రష్యాలను చైనాకు కోల్పోయినట్లు- కనిపిస్తోంది. ఆ మూడు దేశాలకు ఉజ్వల, సుసంపన్నమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నానని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో వ్యంగ్యంగా పోస్టు పెట్టారు. ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలపై ట్రంప్ విరుచుకుపడుతున్న వేళ.. తియాన్‌జిన్ వేదికగా జరిగిన ఎస్‌సీవో సదస్సులో రష్యా, చైనా, భారత్ అధినేతలు ఒకే వేదికపై కనిపించారు. అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లపై చర్చించిన వీరు.. తామంతా ఏకతాటిపై ఉన్నట్లు- సంకేతాలిచ్చారు. వీరి సమావేశంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరిగింది. ట్రంప్ తీరువల్లే ఆ మూడు దేశాలు ఒక్కటయ్యాయనే వాదన కూడా అమెరికాలో వినిపించింది. ఈ నేపథ్యంలో మిత్ర దేశంగా ఉన్న భారత్ దూరమైనట్లు- ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# నేడే నిమజ్జనం

(మొదటి పేజి తరువాయి)
శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు హైదరాబాద్‌లో నిమజ్జన కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. నగరవాసులు.. పోలీసులకు సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. నిమజ్జనం కోసం 10 బేబీ పాండ్లు, 8 పోర్టబుల్ వాటర్ ట్యాంక్‌లు, 8 ఎక్స్కవేషన్ పాండ్లను ప్రభుత్వం ఏర్పాటు- చేసింది. నిమజ్జనం సమయం లో కరెంట్ పోకుండా, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. 10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్న విగ్రహాల వెంట ఒక విద్యుత్ శాఖ అధికారి ఉండనున్నారు. వినాయక నిమజ్జనం పోలీసులకు ఛాలెంజింగ్ అని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ అన్నారు. నిమజ్జనం ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ చాలా కీలకమని, అందుకే నెల ముందు నుంచే ఏర్పాట్లు- చేసినట్టు చెప్పారు. ఆర్‌అండ్‌బీ, సమాచారశాఖ, జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, రవాణా, విద్యుత్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. శనివారం ఉదయం 6గంటలకు ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనం ప్రారంభమై.. మధ్యాహ్నం 2గంటలకు పూర్తయ్యే అవకాశముంది. నిమజ్జన కార్యక్రమంలో సుమారు 10లక్షల మంది పాల్గొంటారని అంచనా. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు- చేశాం. 3,200 మంది ట్రాఫిక్ పోలీసులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. నిమజ్జనంలో పాల్గొనే భక్తులు ప్రజారవాణాను ఎక్కువగా ఉపయోగించు
కోవాలని సీపీ తెలిపారు. గణేష్ నిమజ్జనాల కోసం నెల రోజుల ముందునుంచే రూట్ సర్వే చేసి ఆయా విభాగాలకు అవసరమైన సూచననలు ముందుగానే చేశామని తెలిపారు

### ఖైరతాబాద్ గణపతికి రేవంత్ ప్రత్యేక పూజలు



ఖైరతాబాద్ మహాగణపతిని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారికి సీఎం ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 71ఏళ్ల క్రితం గణేశ్ ఉత్సవ సమితి ఒకే ఒక్క అడుగు గణేశుడిని ప్రతిష్ఠించుకుని ఉత్సవాలను ప్రారంభించింది. దేశంలోనే గణేశ్ ఉత్సవాలకు ఖైరతాబాద్ ప్రసిద్ధి చెందింది. ఒక్కసారి నిర్వహణే కష్టమైన ఈరోజుల్లో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని తట్టు-కుంటూ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి ఉత్సవాలను కొనసాగిస్తోంది. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా, ఇప్పుడు సీఎంగా ఈ ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించింది. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఎక్కడా సమస్యలు లేకుండా ఉత్సవాలను పూర్తిచేసుకున్నాం. ఉత్సవాలను విజయవంతంగా ముగించిన గణేశ్ ఉత్సవ సమితి సభ్యులను అభినందిస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉత్సవ సమితికి అన్ని విధాలుగా సహకారం అందిస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# భూభారతితో ధరణి దుర్మార్గాలకు పాతరేశాం

## జీపీవోలకు నియామక పత్రాలు అందించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, **సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):**
ధరణి వివరాలు ప్రజలకు తెలియకూడదని గత ప్రభుత్వం వీఆర్‌వో, వీఆర్ఏలను తొలగించిందని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అందుకే ధరణి తప్పులను భూభారతితో సరిచేశామని అన్నారు. లేకుంటే వారి దుర్మార్గాలు తెలిసేవి కావని అన్నారు. ధన, భూదాహంతో భూమిని చెరబట్టాలని ధరణి తీసుకొచ్చారు. వారి దోపిడీకి అడ్డుగా ఉన్నారని వీఆర్‌వో, వీఆర్ఏలను తొలగించారు. నిజానికి తెలంగాణలో అన్ని పోరాటాలు భూమి చుట్టూనే తిరిగాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొమురంభీమ్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, రావి నారాయణరెడ్డి తదితరులు భూమి కోసమే పోరాడారని తెలిపారు. భూమికి, తెలంగాణ ప్రజలకు మధ్య ఉన్న బంధం.. తల్లీబిడ్డకు ఉన్న సంబంధమన్న ఆయన.. భూమిని ఆక్రమించుకోవాలని చూసిన వారిని తెలంగాణ ప్రజలు తరిమికొట్టారన్నారు. గ్రామ పరిపాలన అధికారులకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం చేతులమీదుగా జీపీవోలకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమంలో రెవెన్యూ సిబ్బంది ఉవ్వెత్తున పాల్గొన్నారని అన్నారు. రాష్ట్ర సాధనలో రెవెన్యూశాఖ సిబ్బంది కీలకపాత్ర పోషించారని చెప్పారు. ఉద్యమంలో పాల్గొన్న సిబ్బందికి గత సీఎం మేలు చేస్తారని అందరూ ఆశించారని, కానీ ఆరోపణలు తట్టుకోలేక సిబ్బంది ఆత్మహత్య చేసుకున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజలను దోచుకున్నది రెవెన్యూ ఉద్యోగులే అన్నట్లు గత ప్రభుత్వం చిత్రీకరించిందన్నారు. రెవెన్యూశాఖ కావాలని పొంగులేటి అడగలేదు. వారి సమర్థత గుర్తించి ఇచ్చాం. ధరణితో పట్టు-కున్న దరిద్రాన్ని.. భూభారతితో తొలగించే ప్రయత్నం చేశాం. ప్రజలకు రెవెన్యూ అధికారుల వల్ల సమస్యలు రాలేదు. ధరణి వల్లే సమస్యలు వచ్చాయి. ప్రజల సమస్యలు పరిష్కరించాలంటే జీపీవోలు అందుబాటులో ఉండాలి. సాదాబైనామాల సమస్యలను అధికారులు పరిష్కరించాలని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# కెసిఆరే సుప్రీం

(మొదటి పేజి తరువాయి)
మేడిగడ్డ 3 పిల్లర్లు కుంగితే రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదిన్నర నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఆ సమయంలో బాహుబలి మోటార్లతో నీటిని ఎత్తిపోసుకోవచ్చు అని తెలియజేశారు. హైడ్రాతో హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని ఎన్నారైలు పెట్టుబడులు పెట్టడం లేదని హరీష్ రావు విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల ప్రయోజనాలు దెబ్బ తినే విధంగా రాజకీయాలు చేయకూడదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయడంపై దృష్టి సాధించకుండా గూగుల్ ప్రచారంపై దృష్టిపెట్టడం దురదృష్టకరమని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అనేక అద్భుతాలు సాధించిందని తెలిపారు. పాలకులే నెగెటివ్ మైండ్ సెట్‌తో ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. లండన్ పర్యటనలో భాగంగా మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అనేక అద్భుతాలు సాధించింది. ఒకప్పుడు బెంగాల్ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుంది అనే నానుడి ఉండేది. కానీ కేసీఆర్ పాలనతో 'తెలంగాణ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుంది' అనే కాడికి తెచ్చాం. గత 10 ఏండ్లలో తలసరి ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రగామిగా ఉంది. తలసరి విద్యుత్ వినియోగంలో కూడా దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. జీఎస్‌డీపీ గ్రోత్‌లో తెలంగాణకు దరిదాపులో కూడా ఏ రాష్ట్రం లేదు. నల్లా ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని కేసీఆర్ అందించారు. మ్యానిఫెస్టోలో పెట్టు-కోకపోయినా ఇంటింటికీ తాగునీరు అందించిన గొప్ప నాయకుడు కేసీఆర్. అసెంబ్లీలో వచ్చే ఎన్నికల నాటికి ప్రతి ఇంటికి నల్ల ద్వార నీళ్లియ్యకపోతే ఓట్లు- అడుగను అని చెప్పిన గొప్ప నాయకుడు. మిషన్ భగీరథ కార్యక్రమంతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించి చూపించారు. తెలంగాణ రాకముందు హైదరాబాద్‌లో పరిశ్రమలకు పవర్ హాలిడేస్ ఇచ్చేవారు. 4 గంటలకు కరెంటు- కట్ ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో 6 గంటల నుంచి 8 గంటల పవర్ కట్ ఉండేది. 60 ఏండ్లలో కాని పనిని కేసీఆర్ ఒక్క సంవత్సరంలో సాధించి 24 గంటల నాణ్యమైన కరెంటు-ను అందించారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607

# ఘనంగా గణనాథుని నిమజ్జనానికి సిద్ధం

## కోనారెడ్డి చెరువులో భక్తుల ఉత్సాహం
## సర్వం సిద్ధం చేసిన మున్సిపల్ అధికారులు
## భక్తులకు ఉచిత వైద్య సేవలు అందించిన వైద్య అధికారులు
















**వర్ధన్నపేట/సెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):** వినాయక నిమజ్జనం సందర్భంగా వర్ధన్నపేట మున్సిపల్ కేంద్రంలో గణనాథుని నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిగింది. గణేష్ నిమజ్జనానికి మున్సిపల్ అధికారులు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా రహదారులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ తో క్లీన్ అండ్ గ్రీన్ చేపించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ గణపతి నిమజ్జనానికి కోనారెడ్డి చెరువు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా చేసినట్లు తెలిపారు. నిమజ్జనం ఏర్పాట్ల కోసం సర్వం సిద్ధం చేసినట్లు వివరించారు. తమ సిబ్బందితో పాటు నిమజ్జనంలో పాల్గొనేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు..

### వైద్య సిబ్బంది సేవలు...

కోనారెడ్డి చెరువు వద్ద జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో భక్తుల భద్రత,ఆరోగ్య సంరక్షణ కోసం డాక్టర్ నిఖిల్, వైద్య బృందం ఉచిత అత్యవసర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గణేశ్ నిమజ్జనం కోసం భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు తక్షణ వైద్య సేవలు అందించడమే ఈ శిబిరం యొక్క ముఖ్య ఉద్దేశంగా,నిమజ్జనం సందర్భంగా ఎండ తీవ్రత, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ నిఖిల్ తెలిపారు. నిమజ్జనంలో పాల్గొనే సమయంలో ఏవైనా స్వల్ప అస్వస్థతలు, అలసట లేదా ఇతర అనారోగ్య సమస్యలు ఎదురైతే, తక్షణమే వైద్య సహాయం అందించడానికి ఈ శిబిరం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. డాక్టర్ నిఖిల్అ,తని వైద్య సిబ్బంది ఈ గొప్ప చొరవకు భక్తులు ప్రశంసించారు. నిమజ్జనం వంటి భారీ కార్యక్రమాలలో ఇటువంటి అత్యవసర వైద్య సేవలు ఎంతో అవసరమని, ఇది భక్తులకు భద్రతపై భరోసా ఇస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సేవలు భక్తులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమేష్ ,రాజు, హెల్త్ సూపర్వైజర్ మత్యాస్ రెడ్డి, మంజుల, ఆశా కార్యకర్తలు మెడికల్ క్యాప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఒకప్పుడు టీచర్...
## ప్రస్తుతం అశ్వరావుపేట ఎమ్మెల్యే గా...
## జారే ఆదినారాయణ



**అశ్వారావుపేట/సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులను ఉన్నత శిఖరాలలో నిలబెట్టడంలో కీలక పాత్ర ఉపాధ్యాయులది. అజ్ఞానం నుంచి విజ్ఞానం దిశగా నడిపించే సత్తా ఒక ఉపాధ్యాయునికే ఉంటుంది. ఈ రోజు "ఉపాధ్యాయ దినోత్సవం" సందర్భంగా ఒకప్పుడు టీచర్ గా ప్రస్థానం మొదలుపెట్టిన జారె ఆదినారాయణ గత అసెంబ్లీ ఎన్నికల్లో అశ్వరావుపేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. అదేవిధంగా 40 దేశాల నుంచి పాల్గొన్న ఉపాధ్యాయుల్లో తనకు మాత్రమే ప్రపంచ స్థాయి అవార్డు లభించిందని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే తన నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న వారి సమస్యలపై అసెంబ్లీలో తన గళం వినిపించారు. పరిపాలనలో ప్రజలకు అన్ని విధాల అందుబాటులో ఉంటూ ప్రజ సమస్యల పరిష్కారంలో కూడా తనదైన ముద్రను వేస్తున్నారు. తన ప్రస్థానం టీచర్గా మొదలైంది కనుక విద్యార్థుల కు అన్ని రకాలుగా తన సహాయ సహకారాలు అందిస్తున్నారు అని నియోజకవర్గ ప్రజలు , విద్యార్థులు తెలిపారు. ఎమ్మెల్యే జారే విద్యార్థుల సమస్యలపై కూడా అసెంబ్లీలో గళమెత్తారు.

## ముస్లిం యువత ఆద్వర్యంలో
# ప్రవక్త పుట్టిన రోజు వేడుకలు



**స్టేషన్ ఘన్పూర్/సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని తాటికొండ గ్రామంలో ముస్లిం యువత ఆద్వర్యంలో శుక్రవారం ప్రవక్త పుట్టిన రోజు వేడుకలు (మిలాద్ ఉన్ నబీ) ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్య క్రమంలో తాటికొండ ముస్లింపెద్దలు మాట్లాడుతూ ఈ రోజు చాలా గొప్ప రోజు అని, ప్రవక్త ముహమ్మద్ ని స్ఫూర్తిగా తీసుకుని మంచి మార్గం లో నడవాలని కోర దం జరిగింది. యువకులు అందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి, అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించుకోవడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమం లో మగ్దూం అలీ, సలీం, ఖమర్, గాయాజ్, మొహసిన్ అలీ, అరాఫత్, ఆజాం, మతిన్ అలీ, షాహేద్, అమీర్ అలీ, అమీర్ బాబా, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.




## మహేందర్ రెడ్డిని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

**స్టేషన్ ఘన్పూర్/సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని మాజీ ఎమ్మెల్యే రాజయ్య క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ పరిశీల కుడు,జఫర్గడ్ మండల ఇన్చార్జ్ పసునూరి మహేందర్ రెడ్డిని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్య మంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు. మహేందర్ రెడ్డి స్వతహాగా గణితశాస్త్ర లెక్చరర్ గా, కాలేజీ ప్రిన్సిపాల్ గా, కాలేజ్ డైరెక్టర్ గా కొనసాగుతున్న సందర్భంగా మహేందర్ రెడ్డి కి మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఉపాధ్యా య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, వారిని శాలువాతో సన్మానించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తాటికొండ రాజయ్య, జెడ్పి స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మరపాక రవి, స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి అనంతపురం కమలేష్, మండల నాయకులు తదిత రులు పాల్గొన్నారు.

## మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన
## రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్



**వర్ధన్నపేట,/సెప్టెంబర్5(,జర్నలిస్ట్ వార్త):** ప్రపంచ దేశాలు మెచ్చిన నాయకుడు మోడీ చిత్ర పటానికి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ పాలాభిషేకం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో కనీ,విని ఎరగని స్థాయిలో నిత్యవసర సరుకులకు పై జీఎస్టీ 18శాంతం నుండి ఐదు శాతం వరకు ,మరికొన్నిటికి పూర్తి మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వానికి, నరేంద్ర మోడీ నాయకత్వానికి దేశ ప్రజలు మూకుమ్మడిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొన్ని రకాల ముఖ్యమైన అత్యవసరమైన నిత్యవసర సరుకులకు మొత్తానికి మొత్తమే జీఎస్టి సుంకన్ని తొలగించడం వల్ల అట్టడుగున ఉన్న పేద నిరుపేద ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని భారతీయ జనతా పార్టీ ఏదైతే అంత్యోదయ యోజన సిద్ధాంతానికి అనుగుణంగా పనిచేస్తుందో అది అక్షరాల ఈ జీఎస్టి తగ్గించడం వల్ల నిజమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్,కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు మార్టిన్ లూథర్,కుసుమ సతీష్,రాష్ట్ర, జిల్లా పదధికారులు, వివిధ మోర్చాల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం





**పెనుబల్లి/సెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):ఐ** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేద ,మధ్య తరగతి ప్రజల అందరికీ ఉపయోగపడే విధంగా జీఎస్టీ ని 28 శాతం ఉన్న పన్నును 18 శాతానికి, 18 శాతం ఉన్న పన్నులు ఐదు శాతానికి తగ్గించి దేశ ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా చేసినందుకు పెనుబల్లి మండలం సెంటర్లో మండల అధ్యక్షులు బొర్రా నరసింహారావు ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేయటం జరిగింది, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవి రమేష్ మరియు జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, జిల్లా అధికార ప్రతినిధి పడగల మధుసూదన్ ,మరియు మండల ప్రధాన కార్యదర్శి గాయం నాగరాజు, మండల కార్యదర్శి కోటా సుధాకర్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు చెక్కిలాల మంగేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు పేర్ల మహేష్ మరియు కిరణ్, నాగబండ వెంకటేశ్వరరావు, నాయుడు గోవర్ధన్, రమేష్, పాలెపు సతీష్, ఆసంటి వినయ్, మదన్ మోహన్ , నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మా రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన
### ఎమ్మెల్యే దొంతి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షరాలు ఎర్రబెల్లి స్వర్ణ,అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



**వర్ధన్నపేట/సెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి తండ్రి అబ్బిడి లక్ష్మా రెడ్డి ప్రథమ వర్ధంతి శుక్రవారం వర్ధన్నపేట మండలం దమన్నపేట గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షరాలు ఎర్రబెల్లి స్వర్ణ – రాజేశ్వర రావు, తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు లు కలిసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు





## మృతుల కుటుంబానికి
## టీ ఆర్ ఎస్ నాయకుల పరామర్శ



**వర్ధన్నపేట/సెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం, చెన్నారం గ్రామంలో సీనియర్ నాయకులు మంద.రాజాలు అమ్మగారైన మంద కొమరమ్మ(65) అనారోగ్యంతో మృతి చెందాగా మాజీ మంత్రి ఎర్రబెల్లి.దయాకర్ రావు ఆదేశాల మేరకు శుక్రవారం మృతి రాలు భౌతిక దేశాన్ని సందర్శించి ఘనంగా నివాళు లర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తూల్ల.కుమారస్వామి,మాజీ ఎంపీపీ అన్నామనేని. అప్పారావు,మాజీ జెడ్పిటిసి మార్గం బిక్షపతి,నల్లబెల్లి మాజీ ఎంపీటీసీ దుగ్యలజ్యోతి మాధవరావు,మాజీ సర్పంచ్ పెంచాల.కుమారస్వామి,గ్రామ పార్టీ అధ్యక్షుడు మంద.నర్సయ్య, మంద.సంజీవ,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**సత్తుపల్లిసెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు జీఎస్టీ విషయంలో తీపి కబురు అందించిన సందర్భంగా సత్తుపల్లి రూరల్ మండల అధ్యక్షులు సాలి శివకృష్ణ , మండల ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో ప్రధాన సెంటర్ వద్ద ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్ రావు, జిల్లా కార్యదర్శి సుదర్శన మిశ్రా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పేద ప్రజలకు మధ్యతరగతి ప్రజలకు తీపి కబురు అందించిందన్నారు. పేద ప్రజలు ఉపయోగించి వస్తువులపై అసలు జీఎస్టీ లేకుండా మధ్యతరగతి ప్రజలు ఉపయోగించే వస్తువులపై 18శాంతం శాతం నుండి 5శాంతం శాతానికి, 28శాంతం ఉన్న వస్తువులపై 18శాంతం తగ్గించడం జరిగిందన్నారు . అంతేకాక విద్యారంగంలో, ఇన్సూరెన్స్ రంగంలో ఉన్న అన్ని వస్తువులపై జీఎస్టీ ని పూర్తిగా ఎత్తివేయడం జరిగిందన్నారు. అదేవిధంగా క్యాన్సర్ రోగులను దృష్టిలో ఉంచుకొని ఆయా మందులపై జిఎస్టిని తగ్గించటం జరిగిందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పేద ప్రజల మధ్య తరగతి ప్రజల పక్షపాతి వ్యవహరించడం జరుగుతుందన్నారు ఇంత జీఎస్టీని తగ్గించిన నరేంద్ర మోడీ , నిర్మలా సీతారామన్ కి భారతీయ జనతా పార్టీ సత్తుపల్లి రూరల్ మండల బీజేపీ పార్టీ తరపున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ రహంతుల్లా,సత్తుపల్లి రూరల్ మండలం బీజేవైఎం జిల్లా కార్యదర్శి పాల నాగ సురేందర్ రెడ్డి, రూరల్ మండలం ఉపాధ్యక్షులు షేక్ సుభాని, సీనియర్ నాయకులు వందనపు భాస్కరరావు, చీకటి వసంతరావు, నాగ విద్యాలక్ష్మి , జర్పుల మమత, మాదిరాజు వాసు దేవరావు, మరియు బిజెపి పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం,శ్రీనగర్ కాలనీలో భారీ విగ్రహాలతో ఊరేగింపు..



**తల్లాడ/సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల కేంద్రంలో వివిధ సంఘాల గణేష్ ఉత్సవ కమిటీల నేతృత్వంలో జరిగిన వినాయక ఊరేగింపు అంగరంగ వైభవంగా కని విని ఎరగని రీతిలో జరిగింది.తల్లాడ పట్టణంలో వివిధ ప్రాంతాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఆయా కమిటీల నేతృత్వంలో వారి ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలే కాకుండా వివిధ రకాల సాంస్కృతిక తదితర కార్యక్రమాలతో ఉత్సవ కమిటీలు నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు భక్తులలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించడమే కాకుండా సాంస్కృతిక తదితర కార్యక్రమాలతో మానసిక ఉల్లాసాన్ని కూడా అందించాయి.ఆఖరి రోజు ప్రధాన ఘట్టమైన గణేష్ నిమజ్జన కార్యక్రమం అశేష భక్తజన సందోహంతో డిజె సాంగ్స్ తో కోలాట నృత్యాలతో జై బోలో గణేష్ మహారాజ్ కు అనే నినాదాలతో పట్టణ పురవీధులు ఆహ్లాదకర వాతావరణంతో ఆ గణనాథుని శోభాయాత్ర ఎంతో వైభవంగా అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నుండి ఆ సంఘ ప్రముఖులు నంబూరి మోహనరావు,అనుమోలు సర్వేశ్వరరావు,జవ్వాజి నగేష్,కేతేపల్లి భాస్కరరావు,లగడపాటి నెహ్రూ,కాశీ,సంతోష్, కనకయ్య,బాబు,శంకర్,నాగి,మణికంఠ,రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల నిత్య అవసరాల సరుకులపై జిఎస్టి తగ్గించినందుకు మోడీకి పాలాభిషేకం



**తల్లాడ/సెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):** భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ పేద ప్రజల అందరికీ ఉపయోగపడే విధంగా జీఎస్టీ 28శాంతం ఉన్న పన్నులు 18శాంతం శాతానికి, 18శాంతం ఉన్న పన్నులను 5శాంతం నకు తగ్గించి దేశ ప్రజలకి అందరికీ ఉపయోగపడే విధంగా చేసినందుకు తల్లాడ మండలం రింగు రోడ్డు సెంటర్లో తల్లాడ మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చల్లా నాగులు, జిల్లా కౌన్సిల్ మెంబర్ గాదే కృష్ణారావు,మండల ప్రధాన కార్యదర్శులు రాయల రమేష్ పెరిక కిరణ్, ఉపాధ్యక్షులు గొల్లమందల నరేష్, వేము రజిత, మండల కార్యదర్శులు తమ్మి శెట్టి కృష్ణ, చల్లా నరేష్.కోశాధికారి యద్దనపూడి శ్రీనివాస్, మాజీ యువ మోర్చా అధ్యక్షులు ఎల్లంకి సుధాకర్, మాజీ కిసాన్ మోర్చా అధ్యక్షులు చౌడ నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు యుద్ధగిరి రామారావు,పులి వెంకటేశ్వర్లు, మర్సకట్ల బాబురావు,వేమారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వర్ధన్నపేట ఎస్ ఐ సాయి బాబు ని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు




**వర్ధన్నపేట/సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ కు నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన వర్ధన్నపేట ఎస్ ఐ సాయి బాబు ను శుక్రవారం మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర పొలిటి బ్యూరో సభ్యులు ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల తండాలల్ల గుడుంబా బెల్ట్ షాపులు రాత్రి పగలు లేకుండా నిర్వహించడంతో యువత మత్తుకు బానిసలు అవుతున్నారని తెలపడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎలికట్ట ప్రభాకర్ మాదిగ. ఇలబెల్లి అబ్రహమ్ మాదిగ. ఇలబెల్లి సురేందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు

# పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో గణపతి నిమజ్జన వేడుకలు

**విగ్రహ దాత సబ్బని భవాని-సత్యనారాయణ. - అంబరాన్నంటిన నిమజ్జన వేడుకలు, కన్నుల పండువగా శోభాయాత్ర.**









**హుజురాబాద్/ సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామంలో పద్మశాలి సేవా సంఘం లో ప్రతి సంవత్సరం లాగే,ఈసంవత్సరం కూడా నూతన అధ్యక్షులు సుంకెనపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టా చెయ్యడం జరిగింది.తొమ్మిది రోజులు ఉదయం,సాయంత్రం ఘనమైన పూజలందుకున్న గణపయ్యకు శుక్రవారం భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. రంగు రంగుల కాగితాలు,పూలు, విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనాల్లో వినాయక విగ్రహాన్నీ ఉంచి కన్నుల పండుగగా శోభయాత్ర నిర్వహించారు.

దారి పొడవునా డప్పు చప్పుళ్లు, నృత్యాల హోరీరుతో వైభవంగా సాగిన వినాయక నిమజ్జనంలో అడుగడుగునా గణపయ్యకు భక్తులు నీరాజనం పలికారు. జై గణపతి జై జై గణపతి... గణపతి బొప్ప మోరియా ఆదాలడ్డూ కాలియా అంటూ భక్తులు, నినాదాలు మిన్నంటగా తీన్మార్ డ్యాన్సు లు, ప్రత్యేక డీజే చప్పుడ్లతో పాటు అతివల కోలాటం, చిన్నారుల కేరింతల నడుమ విఘ్నేశుడిని చెరువులో నిమజ్జనం చేసి 'పోయిరా గణపయ్యా పోయిరా' అంటూ గంగమ్మ ఒడికి చేర్చారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత సబ్బని భవాని-సత్యనారాయణ, అధ్యక్షులు సుంకెనపేల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తలకొక్కుల శ్రీనివాస్ ,గౌరవ సలహాదారులు సంగెం వెంకటస్వామి, కొక్కుల రవీందర్, గౌరవ అధ్యక్షులు సంగెం డాక్టర్ ఐలయ్య , మరియు సంగెం ధర్మయ్య, సంగెం శ్రీధర్, బొల్లు కృష్ణమూర్తి, కొక్కుల సుధాకర్ , తుమ్మ రాజేశం, సుంకెనపేల్లి వెంకటేశ్వర్లు,రాజేష్, వెంకటేష్, సంగెం లోకేష్, కుసుమ ఈశ్వర్ , ఆంజనేయులు తలకొక్కుల సమ్మయ్య, సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్న మండలం కాంగ్రెస్ నాయకులు





**కల్లూరు/సెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):**పట్టణ పరిధిలో వీర బ్రహ్మేంద్ర నగర్ లో గణేష్ విగ్రహం మంటపం వద్ద గోపాచారి ఆధ్వర్యంలో బ్రహ్మంగారి కమిటీ అన్నదాన కార్యక్రమం ఘనగా నిర్వహించడం జరిగింది.ఈ అన్నదాన కార్యక్రమానికి మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండల కాంగ్రెస్ నాయకులని వీర బ్రహ్మంగారి కమిటీ శ్యాలువా తో సన్మానించారు.అనంతరం మున్సిపాలిటీ పరిధిలో ఖాన్ ఖాన్ పేట లో రాజబోయిన శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు వినాయక మందిరం వద్ద పూజా కార్యక్రమం లో పాల్గొని అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులతో కలిసి పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో లక్కినేని కృష్ణ, ఏనుగు సత్యంబాబు, పెద్దపోయిన శ్రీనివాసరావు, బత్తుల రాము, దేవరపల్లి శ్రీనివాసరావు,బైర్ల కాంతారావు, తోట సుబ్బారావు, కరుణాకర్, నాగేశ్వరరావు, నారబోయిన శ్రీను, హనుమంతురావు, కాళిదాసు వేలాద్రి, కమిటీ సభ్యులు, భక్తులు, మహిళాలు,పెద్దలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చొరవతో యూరియా మరింత దిగుమతి చేయాలి

### తల్లాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సరికొండ



**తల్లాడ/సెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):** మండలం లో రైతులు చాలీచాలని యూరియాతో అనేక ఇక్కట్లు పడుతున్న సందర్భాలు మండలంలో అనేకంగానే ఉన్నాయి, రైతులు ఇబ్బంది పట్ల చలించిపోయిన తల్లాడ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరాజు మాట్లాడుతూ రైతుల దేశానికి వెన్నుముక్కని, రైతులు కంటతడి పెట్టటానికి అధికార ప్రభుత్వం కారణమవుటం సమన్యాసం కాదని మండిపాటుకు గురయ్యారు, అదేవిధంగా సొ (తెలుగుదేశం పార్టీ) మండల కేంద్ర పరిసర ప్రాంతాల్లో యూరియా పట్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సొసైటీకి కొద్ది మొత్తంలో యూరియాని సరఫరా చేసి రైతులకు సరిచూచమనటం హేయమైన చర్యని, ప్రాంతాల్లో ఎక్కువగా రైతులు ఉన్న నేతృత్వంలో ప్రభుత్వం తక్కువ మొత్తంలో యూరియా బస్తాలు తల్లాడ కేంద్రానికి దిగుమతి చేయటం సరైన నిర్ణయం కాదని, ప్రభుత్వం రైతులకు ఎప్పుడు ప్రోత్సాహం అందించాలని, ఒకటే యూరియా కట్ట ఇచ్చి సరిచేయాలని సంబంధిత యాజమాన్యానికి సరిదిద్దాల అనటం ఖండిస్తున్నానని సొసైటీ సంబంధిత శాఖలో అధికారులు సైతం రైతులు ఆగ్రహానికి అధికార యంత్రాంగం పదోన్నతులు నమ్మకాలు కోల్పోతున్నాయని, తప్పుడు ప్రవచనాలు వినపడుతున్న తరుణాల్లో నిందలు పడే అవకాశాలు ఉన్నాయని కొనియాడారు, అదేవిధంగా అధికార ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం నుంచి మండలానికి అయినా ఆ సమతుల్యతంగా యూరియాని దిగుబడి చేసి రైతులకు సమస్యల పట్ల విముక్తి కలిగించాలని కోరారు

# జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్ సారంగపాణి



**నర్సంపేట/సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్ సారంగపాణి ఎస్.ఏ. ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ గేమ్స్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వరంగల్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక కాబడి శుక్రవారం ఆకుతోట కన్వెన్షన్ హాల్లో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ శారదా దేవి ఐఏఎస్ డీఈఓ వరంగల్ రంగయ్య నాయుడు ఇతర జిల్లా అధికారుల చేతుల మీదుగా ఉత్తమ ప్రశంశా ప్రత్రం అందించి ఘనముగా సన్మానం చేశారు.

## అంగన్వాడి భవనానికి శంకుస్థాపన



**హుజురాబాద్/సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామంలో హుజరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి ఓడితల ప్రణవ్ బాబు సహకారంతో ఈ జి ఎస్ నిధుల నుండి మంజూరు 12 లక్షల రూపాయలతో అంగన్వాడి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోడేటి బిక్షపతి, కొండ తిరుపతి, మార్కెట్ డైరెక్టర్ ఒరుసు తిరుపతి, మాజీ ఎంపీపీలు మాట్ల రమేష్ ,తడుక శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ డాక్టర్ మౌటం కుమారస్వామి, మాజీ మండలాధ్యక్షులు పుల్లూరి శ్రీనివాసరావు, బొల్లం రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గూడెపు మొగిలయ్య, పి ఆర్ ,ఏ ఈ మధు, గ్రామ కార్యదర్శి,చిలువేరు రవీందర్, మాజీ ఎంపిటిసి రామస్వామి, మాజీ సర్పంచ్ పంజాల సారయ్య, రఘుపతి తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ఉత్తమ కోర్టు డ్యూటీ పోలీసులుగా ప్రశంశ పత్రం అందుకున్న ధర్మసాగర్ పోలీసులు



**హనుమకొండ/సెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో లోని ముప్పారం గ్రామానికి చెందిన ఆలకుంట రాజు అతని భార్యను మంచం కోడుతో కొట్టి చంపగా ఆ కేసులో 18 మంది సాక్షులను కోర్టులో హాజరు పరిచినారు జిల్లా జడ్జి నిందితుడు ఆలకుంట్లా రాజుకు 8 సంవత్సరాలు శిక్షను జిల్లా జడ్జి గారు విధించారు. ఇట్టి కేసులో కేసులో 18 మంది సాక్షులను కోర్టులో హాజరు పరిచి నిందితునికి శిక్ష పడేలా ప్రతిభ కనబరిచిన ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ జన్ను రమేష్, కోర్టు ప్రాసెస్ డ్యూటీ హోంగార్డ్ అంబటి సుధాకర్ రాజు ఇరువురికి వారి విధులను ఎంతో బాధ్యతగా నిర్వహించినందుకు గాను వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంస పత్రము అందజేసినారు. కమిషనర్ ఆఫ్ పోలీస్ ఇరువురికి ప్రశంసా పత్రం అందజేస్తూ ఇకపై కూడా వారు వారి విధులను ఇంతే బాధ్యతగా నిర్వహించాలని చెబుతూ అభినందనలు తెలియజేశారు అలాగే ఇరువురికి ధర్మసాగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్,సబ్ ఇన్స్పెక్టర్ నరసింహారావు ,పోలీస్ సిబ్బంది ఇరువురికి అభినందనలు తెలియజేశారు.



# శ్రీదివ్య ఫెర్టిలైజర్ షాపు లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేయాలి

**-యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలి. -ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు డిమాండ్.**



**బయ్యారం/సెప్టెంబర్5 (జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండలం కొత్తపేట గ్రామంలో శ్రీ దివ్య ఫెర్టిలైజర్ షాప్ యజమాని అక్రమంగా యూరియాను నిల్వచేసి దొడ్డి దారిన అధిక ధరలకు విక్రయించడానికి పూనుకున్న షాప్ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని. ఫెర్టిలైజర్ షాపుని లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు అధికారులను డిమాండ్ చేశారు.ప్రభుత్వానికి.అధికారులకు ముందు చూపులేకపోవడం వలన యూరియా కొరత ఏర్పడిందని కేంద్ర.రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగం పట్ల అనుసరిస్తున్న విధానాల ఫలితమే రైతాంగం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ వ్యవసాయానికి దూరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. అందులో భాగంగానే యూరియా కొరత అని అన్నారు.గత నెల రోజుల నుండి రైతాంగానికి యూరియా దొరకడం లేదు వేసిన ఎ ా ు ు క ్ క జ ొ న ్న వ త్తి . వ రి . వ ం ట లు యూరియా వేకపోవడం వలన పంటలు దెబ్బతిని పో త ు న్నా య ు ని రైతాంగం ఆవేదన చెందుతూ వారాల తరబడి అనేక అవస్థలు పడుతూ పొద్దస్తమానం యూరియా కోసం సొసైటీల ముందు క్యూలో నిలబడ్డ దొరకడం లేదని రైతులు అనేక రకాల నిరసనలు తెలిపినప్పటికీ ప్రభుత్వం. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు. రైతాంగానికి యూరియా అందించడంలో విఫలం చెందారని వారన్నారు వచ్చిన యూరియా కట్టలను అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేనందున వ్యాపారస్తులు దొడ్డిదారిన అధిక రేట్లకు అమ్ముతున్నారని వారన్నారు. దొడ్డిదారిన అధిక రేట్లకు అమ్ముతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు యూరియా కొరతను నివారించి రైతాంగానికి సరిపడా యూరియాను వెంటనే అందజేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం డిమాండ్ చేస్తుంది లేని యెడల రైతాంగ ఉద్యమాలను ఉదృతం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నాం. సకాలంలో యూరియా అందాక వేసిన పంటలు దెబ్బతిని దిగుబడి రాకపోతే దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# వేలేరు మండలంలో చర్చనీయాశంగా మారిన గణపతి లడ్డూ వేలం.



**వేలేరు/సెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):** వినాయకుని నవరాత్రి వేడుకల సందర్భంగా వేలేరు మండలంలో ఏనాడుకనీవినీ ఎరుగని రీతిలో గణపతి నవరాత్రి లడ్డూల వేలం చర్చనీయాశంగా మారింది గురువారం వేలేరు మండల కేంద్రంలోని మైత్రీ గణేష్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా వినాయకుని వద్ద ఉంబడిన లడ్డూను వేలం వేయగా తీవ్రమైన పోటీలో వేలేరు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మైత్రీ గణేష్ ఉత్సవకమిటీ అధ్యక్షుడు అక్కల స్వరూప అశోక్ దంపతులు రూ.49,500(నలుబై తొమ్మిది వేల ఐదువందల) లడ్డూను గెలుచుకోవడం ఇది వేలేరు మండలంలోని సోషల్ మీడియాలో వైరల్ కావడం చర్చనీయాశంగా మారినందుకు మైత్రీ గణేష్ ఉత్సవకమిటీ సభ్యులు గణనాథునికృప మాపై ఉందని ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఇలారాబోయే రోజులలో కూడా గ్రామీణ ప్రాంతాలలో గణనాథుని లడ్డూల వేలంకు పోటీతత్వం ఉంటుందేమనని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అక్కల అశోక్, జోగు మురళి, మోతె రవిందర్, కొయ్యడ జీవన్, కొయ్యడ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలే స్ఫూర్తి

**-ఇంచార్జ్ ప్రిన్సిపాల్ నరేంద్ర రాజు.**




**బయ్యారం/సెప్టెంబర్ 5( జర్నలిస్ట్ వార్త):** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బయ్యారం జూనియర్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ నరేంద్ర రాజు తోటి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆచరించి చూపిన ఆదర్శాల నుంచి స్ఫూర్తిని పొందుతూ ఎందరో మహానుభావులు ఉపాధ్యాయ వృత్తికి పునరంకితమవుతున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్బంగా టీచర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ నరేంద్ర రాజు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు ఘన నివాళి అర్పిస్తూ జరుపుకునే పండుగ రోజు అని,డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆచరించి చూపిన ఆదర్శాల నుంచి స్ఫూర్తిని పొందుతూ ఎందరో మహానుభావులు ఉపాధ్యాయ వృత్తికి పునరంకితమవుతున్నారన్నారు.పిల్లల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్న వారందరికీ అభినందనలు తెలుపుతున్నా అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓకే సంతోష్ అధ్యాపకులు కుమారస్వామి, గిరి, సరిత, స్నేహ, సదాశివుడు, భాస్కర్, రాజేష్, బాబు లాల్, మనోజ్ కుమార్, సుస్మిత, రాములు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు ఉమ్మలేరు వాగులో పడి రైతు మృతి

**-కేసు నమోదు,ఎస్ఐ తిరుపతి.**



**బయ్యారం/సెప్టెంబర్ 5( జర్నలిస్టు వార్త):** గంగారం మండలం పందెం గ్రామానికి చెందిన బచ్చల రవి (38) ఈ నెల మూడో తారీఖున గంగారం మండలం పందెం పరిసర ప్రాంతాలలో తమ వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి రాకపోవడంతో పోలీసులకు పిర్యాదు చేశారు.శుక్రవారం బయ్యారం మండలం మిర్యాల పెంట గ్రామానికి చెందిన సుందర్ ఉమ్మలేరు వాగులో శవం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు.సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా పందెం గ్రామానికి చెందిన బచ్చలి రవి గా గుర్తించారు.ఇతడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.మృతుడి బార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

# సమాజం భవిష్యత్తుకు దిక్సూచి గురువే...

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**





**మహబూబాబాద్ బ్యూరో/ సెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):** మహబూబాబాద్ లో సమీకృత కలెక్టర్ సముదాయంలో ని మీటింగ్ హాల్లో శుక్రవారం గురుపూజోత్సవం.ఘణంగా జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి హెచ్ వి ఎన్ పి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్రావు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రంలో మన జిల్లా ఎస్ఎస్సి ఫలితాల్లో మొదటి స్థానం సాధించినందుకు ఉపాధ్యాయులు అందరికీ అభినందనలు తెలిపినారు. ఈరోజు సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ,ఒక పుస్తకం మనసును మార్చగలదు. ఒక ఉపాధ్యాయుడు జీవితాన్ని మార్చగలడు.అని మన దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందని ,విద్యార్థులను ఆ భవిష్యత్తుకు సిద్ధం చేసే శక్తి, ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని ,అందుకే ఉపాధ్యాయుల వృత్తి అత్యంత పవిత్రమైనది, ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పేవాడు మాత్రమే కాదు, ఆయన ఒక మార్గదర్శకుడు, ప్రేరణ శక్తి,సమాజ నిర్మాత,ఒక విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి, ఉపాధ్యాయుల కృషి ఎప్పుడూ ఉంటుందని , అందుకే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించి, సమాజంలో ముందుకు నడవాలి అని తెలిపినారు.ముఖ్య అతిథి ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు, మాట్లాడుతూ మన మొదటి గురువు మన తల్లిదండ్రులు తరువాత ఉపాధ్యాయులు.ఉపాధ్యాయుల సేవలను గౌరవిస్తూ ఉన్నాను, ఉపాధ్యాయుడు విద్యార్థికి గురువు మాత్రమే కాక, మార్గదర్శకుడు, ప్రేరణ దాత కూడా, మీ అందరి నిబద్ధత, కృషి పట్ల నేను గర్విస్తున్నాను. భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దడంలో, మీ సేవలు చిరస్మరణీయం, విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దే మహత్తరశక్తి ఉపాధ్యాయులదే అని విద్యార్థులకు, శ్రేయోభిలాషులకు, సహకరించిన ఉపాధ్యాయులందరికీ, పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్బంగా ఎంపిక చేయబడిన 12 మంది ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులను కలెక్టర్, ఎమ్మెల్సీ ,డిఈఓ సన్మానించినరు. ఈ కార్యక్రమం లో శ్రీరాములు, అప్పారావు, సంతోష్ ఆజాద్, పూర్ణ చందర్, ఉమామహేశ్వర్, సతీష్, శ్రీనివాస్ మరియు వివిధ మండలాల ఎమ్ ఇఓలు పాల్గొన్నారు.

# గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం





**వర్ధన్నపేట/సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణం పిరంగి గడ్డ లో ముదిరాజ్ యువసేన యూత్ అసోసియేషన్ వారు ప్రతిష్టాపించిన గణపతి వద్ద శుక్రవారం కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ప్రత్యేక పూజలు చేశారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ముదిరాజ్ యువసేన యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద వేద పండితులు శేషం వెంకట రమణ చారి అధ్వర్యంలో నిర్వహించిన శ్రీ విఘ్నేశ్వర స్వామి పూజ కార్యక్రమంలో

కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం నిర్వాహకులు ఈగ మల్లేశంకు శాలువాగప్పి ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ ప్రజలందరి జీవితాల్లో విఘ్నాలు తొలగి సుఖ సంతోషాలతో ఉండాలని వారు స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిలివేరు కుమారస్వామి, జన్నపురెడ్డి దేవేందర్ రెడ్డి, కరిమిల్ల సంపత్ రావు, గణపతి ఉత్సవ కమిటీ యూత్ సభ్యులు నక్క రాజు, కుక్కల రాకేష్, బోనాల హరీష్, మట్టపల్లి అనిల్, భూమా రంజిత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయంలో సేంద్రియ వ్యవసాయాన్ని రైతులు పాటించి,

# ప్రజా ఆరోగ్యం నకు పెద్ద పీట వేయండీ

**రసాయనిక ఎరువులు అరికట్టండి**

**భూమి ఆరోగ్యాన్ని కాపాడండి.**

**కార్పొరేట్ సంస్థల మాటలు నమ్మి ,వ్యవసాయం చేయకండి.**

**తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**

**రైతు కమీషన్ సభ్యులు, శాస్త్రవేత్తలు**





**మహబూబాబాద్ భ్యూరో/ సెప్టెంబర్5(జర్నలిస్ట్ వార్త):** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో వ్యవసాయంలో సేంద్రీయ పద్ధతులను పాటిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న సోలేటి జైపాల్ రెడ్డి పలువురి కి ఆదర్శ ప్రాయుడు,ప్రధాని మోడీ చేత ప్రశంసలు అందుకున్నారు. జిల్లాలో భూసారాన్ని కాపాడుతూ భూమి పరీక్షలు ఆధారంగా భూమిపై పంటలు వేయాలని, కార్పొరేట్ సంస్థల మాటల విని రైతులు మోసపోవద్దని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ నాయకులు, చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబాద్ జిల్లాలో కేసముద్రం మండలం ఈదుల పూసపెల్లి గ్రామంలో నూకల రఘునాధ రెడ్డి అభినవరెడ్డి ఫౌండేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ అరబిందో ఫార్మా ఫౌండేషన్ మరియు జన్నారెడ్డి వెంకటరెడ్డి ఉద్యానవన పరిశోధన కేంద్రం జే వి ఆర్ హెచ్ ఆర్ సి ఆధ్వర్యంలో నేచరల్ ఫార్మింగ్ ట్రైనింగ్ బి.ఆర్.సి సెంటర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రైతు కమిషన్ నాయకులు భూభారతి సునీల్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, భవాని రెడ్డి తదితరులు పాల్గొని సోలేటి అభిమాన రెడ్డి ఘాటు వద్ద శ్రద్ధాంజలి ఘటించి జయపాల్ రెడ్డి వ్యవసాయ క్షేత్రమును పరిశీలించారు .అనంతరం నేచురల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని జ్యోతి వెలిగించి,వారు రైతులను ఉద్దేశించి,మాట్లాడుతూ, దేశంలో రైతులు రసాయనిక ఎరువులు, ఫెర్టిలైజర్స్ ,ఫెర్టిసైడ్స్ మోతాదుకు మించి వాడుతూ భూమి సారాన్ని, నిసత్వం చేస్తున్నారని ,భూమిపై కర్షన వ్యర్థాలు చేస్తున్నారని,దీనితో భూమిపై రాబోవు రోజులలో ఏ పంటలు పండవని,ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మన పూర్వీకులు రైతులు సేంద్రియ వ్యవసాయం చేసి భూమి సారాన్ని నిస్సత్వ కాకుండా చూశారని అన్నారు. నాణ్యమైన పంట లు పండించారు.పోటీ ప్రపంచంలో కార్పొరేట్ సంస్థలు విత్తన సంస్థల , పురుగుమందుల పేరిట రైతులకు నకిలి విత్తనాలను, జన్యు మార్పిడి విత్తనాలను, రైతులకు అంటగడుతూ కోట్లు గడిస్తూ, రైతులను నష్టపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో ములుగు జిల్లాలు కొన్ని విత్తన కంపెనీలు మొక్కజొన్నలను విత్తనాలను ఇచ్చి మోసగించారని, వారు వేసిన మొక్కజొన్న కంకి పంట తినడం వల్ల పశువులు, రైతులు మృతి చెందారని ఆందోళన వ్యక్తం చేశారు .ఇలాంటి వల్ల మన భౌగోళిక భూమి సారం కోల్పోయి మనిషి జీవన విధానంలో పెను మార్పులు రావడం, వాతావరణంలో పెను మార్పులు సంభవించడం చూస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా రైతులు ఆర్గానిక్ వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం చేసి లాభాలు ఘటిచాలని కోరారు. రైతులకు అనేక హక్కులు ఉన్నాయని, విత్తన చట్టం ఇతర చట్టాలపై అవగాహన లేకపోవడం వలన రైతుల నష్టపోతున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్ రెడ్డి ,తెలంగాణ రాష్ట్రంలో, దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ంలోరైతు కమిషన్ ఏర్పాటు చేసి రైతుల శ్రేయస్సుకోసం పని చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో రైతులకు రుణమాఫీ 20 వేల కోట్లు రైతు భరోసా కోసం 15 రోజుల్లో 9,000 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు .రైతు స్వయం సమృద్ధిగా,నిలబడి ఆర్థికంగా అభివృద్ధి జరగాలని కోరారు. కేంద్రం ప్రకృతి వ్యవసాయం కోసం దేశంలో రైతులను ప్రోత్సహించడానికి రెండువేల కోట్లు ఇవ్వడం ,ఏమాత్రం సరిపోదని, దానిని లక్ష కోట్ల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆర్గానిక్ వ్యవసాయం ప్రోత్సహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆకాంక్షించారు . పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రపంచ దేశాలు పాటు పడే విధంగా చర్యలు ఉండాలని కోరారు. రైతు కమీషన్ సభ్యులకు పకృతి వ్యవసాయ ప్రేమికుడు జైపాల్ రెడ్డి మెమోంటో,జ్ఞాపికలను బహుకరించారు.

### రాష్ట్రంలో ఆదర్శ రైతుల వ్యవస్థ కొనసాగించాలి.

**రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండ్రాతి భాస్కర్ రెడ్డి**

రాష్ట్రంలో రైతులకు సలహాలు,సూచనలు ఇచ్చే విధంగా ప్రోత్సాహించాలని, దివంగత రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి ఆదర్శ రైతుల వ్యవస్త కొనసాగించి, రైతులు మనోధైర్యాన్ని నింపారని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి సారథ్యంలో వ్యవస్థను పునః రుద్ధ రించాలని, తెలంగాణ రాష్ట్ర ఆదర్శ రైతుల సంఘం ఉపాధ్యక్షులు గుండ్రాతి భాస్కర్ రెడ్డి, మహబూబాబాద్ డివిజన్ ఆదర్శ రైతులు అజ్మీరా వెంకన్న, ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో రైతు కమీషన్ నాయకులను కలిసి వేడుకున్నారు.దీనిపై కమిషన్ నాయకుడు స్పందించి, ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి రైతులకు సహకారమయ్యే ,ఏ పనులైన సహకరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎఫ్ పి ఓ ఫౌండేషన్ అడ్వైజర్ నంద్యాల నరసింహారెడ్డి, పి జె టి ఏ యు హరీష్ ఖాన్, ప్రకృతి సేద్య నిపుణుడు కుడుముల వెంకటరెడ్డి, జె వి ఆర్ హెచ్ఆర్సీ రాష్ట్ర శాస్త్రవేత్త నాగరాజు మహేష్ భారతీయ కిసాన్ మోర్చా నాయకులు గోపాల్, మహబూబాబాద్ డివిజనల్ వ్యవసాయ అధికారి శ్రీనివాస్ నాయక్, కే సముద్రం మండల ఏవో, ఏ ఈ ఓ లు జిల్లా నుండి సేంద్రీయ వ్యవసాయ రైతులు తదితరులు పాల్గొన్నారు

## అబ్బిడి లక్ష్మా రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన

# కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం





**వర్ధన్నపేట/సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త) :** అబ్బిడి లక్ష్మా రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి తండ్రి కీ. శే. అబ్బిడి లక్ష్మా రెడ్డి ప్రథమ వర్ధంతి శుక్రవారం వారి స్వగృహంలో జరిగింది.ఈ కార్యక్రమానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై లక్ష్మా రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో సిలివేరు కుమారస్వామి, జన్నపురెడ్డి దేవేందర్ రెడ్డి, కరిమిళ్ల సంపత్ రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.